కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

- కూటమి అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొందాం
- డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

గడివేముల: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండడానికే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ ఆవిష్కరించారని పార్టీ మండల కన్వీనర్ బొంతల మధుసూదన, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి అన్నారు. మంగళవారం గడివేములలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి అరాచక పాలనకు చెక్ పెట్టేందుకు డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని, పార్టీ శ్రేణులపై జరిగే దాడులను మొబైల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వాటికి పరిష్కారం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చూపిస్తారన్నారు. అన్యాయానికి గురైన కార్యకర్తలు డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 040-49171718కు కాల్ చేయవచ్చన్నారు. కార్యకర్తలను కాపాడుకోవడానికి పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. డిజిటల్ బుక్‌ను గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి కూటమి కూటమి నేతల అరాచకాలను ఎండగట్టాలని సూచించారు. కూటమి నాయకులు గ్రామాల్లో చేసిన అన్యాయాలను, అక్రమాలను ఇందులో నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త డిజిటల్ బుక్‌ను వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వంగాల మహేశ్వరరెడ్డి, నాయకులు పోగుల చంద్రశేఖర రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, బాల చెన్ని, గోదా ప్రసాద్, దేశం నాగేశ్వరరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, రఘు మాధవ రెడ్డి, సుబ్బా రెడ్డి, వెంకటేశ్వర్లు, లవంగాల ఫరూక్ బాషా, రామ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


గడివేములలో డిజిటల్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

కొత్తూరులో జడ్జి పూజలు


జడ్జి కమలాదేవికి తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

పాణ్యం: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉన్న వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. కర్నూల్ అడిషనల్ సెషన్స్ జడ్జి కమలాదేవి కుటుంబంతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. జడ్జికి శేషవస్త్రాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డోన్ డివిజన్ ఎలక్ట్రికల్ డీఈఈ కమలాకర్‌రావు, బేతంచెర్ల ఏఈ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం పంచాయతీరాజ్ డైరెక్టర్ నాగరాజు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

కోడుమూరు రూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎస్టీయూ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న అన్నారు. మండలంలో నూతనంగా ఎంపికైన 25 మంది ఉపాధ్యాయులను మంగళవారం స్థానిక పెన్షనర్ల భవనంలో ఎస్టీయూ నాయకులు, రిటైర్డ్ టీచర్లు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తిమ్మన్న మాట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులంతా తమ వృత్తిని గౌరవిస్తూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించి సమ సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా అంకిత భావంతో విద్యను బోధించాలన్నారు. ఎస్టీయూ నాయకులు విక్టర్, గోకారి, జనార్దన్, రిటైర్డ్ హెచ్ఎం రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

కోడుమూరు రూరల్: గూడూరు మండలం బూడిదపాడు గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంగడి మౌలాబి అనే మహిళకు చెందిన మట్టి మిద్దె మంగళవారం తెలవారుజామున కూలిపడింది. ఆ సమయంలో మౌలాబి ఇంటి బయట నిద్రిస్తుండడంతో పెను ప్రమాదం తప్పింది. వర్షాలకు ఉన్న మట్టి మిద్దె కాస్తా కూలిపోవడంతో తనకు ఉండేందుకు ఇల్లు లేకుండా పోయిందని, ప్రభుత్వం స్పందించి ఇంటి నిర్మాణానికి డబ్బులు మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె కోరారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. సోమవారం రాత్రి 10:30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామానికి చెందిన రంగన్న అనే రైతు తన ఎద్దులను పశువుల దొడ్డిలో కట్టేసి ఉంచాడు. మెరుపు, భారీ శబ్దంతో పిడుగు పడటంతో రంగన్నకు చెందిన ఒక ఎద్దు అక్కడికి అక్కడే ప్రాణాలు కోల్పోయింది. రూ.60 వేలకు పైగా విలువ చేసే ఎద్దు పిడుగుపాటుకు మృత్యువాత పడటంతో రైతు కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు. మంగళవారం విషయం తెలుసుకున్న పోలకల్ పశు వైద్యశాల డాక్టర్ రోనార్డ్ రీచర్డ్స్ ఘటనా స్థలానికి చేరుకుని ఎద్దు కళేబరాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిర్వహించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ


ఆయుధ పూజ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

గడివేముల: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్టేషన్‌లోని ఆయుధాలు, వాహనాలకు, గణపతి, దుర్గామాతకు పూజలు చేశారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎస్ఐ ఆకాంక్షించారు.

3 నుంచి ఉరుసు

కర్నూలు (అర్బన్): కర్నూలు నగరంలోని జొహరాపురంలో అక్టోబర్ 3వ తేదీన గంధం, 4న ఉరుసు (తట్టీలు), 5న కిస్తీలు (జియారత్) ఉరుసు మహోత్సవం జరుగుతుందని దర్గా ముతవల్లి సయ్యద్ అల్లా ఉద్దీన్ షరీఫ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. జొహరాపురం ఉరుసును అన్ని మతాల వారు సామరస్యంగా మూడు రోజులు జరుపుకుంటారని చెప్పారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కర్నూలు(రూరల్): స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం పసుపుల గ్రామంలో కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ.. రేషన్ కార్డుల స్థానంలో ప్రభుత్వ కొత్తగా స్మార్ట్ కార్డులను తెచ్చినట్లు చెప్పారు. కర్నూలు మండల తహసీల్దారు టి.వి. రమేష్‌బాబు, గ్రామ పంచాయతీ సెక్రటరీ హేమంత్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేపు జంతువధ నిషేధం

కర్నూలు(టౌన్): గాంధీ జయంతి పురస్కరించుకొని ఈ నెల 2న కర్నూలు నగరంలో జంతువధ నిషేధించినట్లు నగరపాలక ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కబేళాలు, మాంసం దుకాణాలు, అమ్మకందారులు తమ షాపులను మూసివేయాలన్నారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు మాంసం విక్రయాలు చేపట్టరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడమే కాకుండా వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

దుర్గమ్మా.. కరుణించు


పూజలందుకుంటున్న నిడ్జూరు దుర్గామాత.., దుర్గమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరి, సుంకులా పరమేశ్వరి


దుర్గామాతగా వెంకాయపల్లె ఎల్లమ్మ,అంబా భవానీ


వల్లెలాంబదేవి పల్లకీ సేవలో డాక్టర్ ఆదిమూలపు సతీష్


దుర్గాదేవి అలంకరణలో వల్లెలాంబదేవి


బెళగల్ ఈశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాత, శ్రీరాములమ్మ, తులజా భవాని, అంబా భవాని, వల్లెలాంబదేవి ఆలయాల్లో దుర్గాదేవిగా దర్శనమివ్వడంతో ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. అలాగే వల్లెలాంబదేవికి మంగళవారం రాత్రి భక్తులు పూజలు నిర్వహించి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు.

– పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవికి మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్టారెడ్డి, మేధావుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రవీంద్రరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ అమ్మవారి సన్నిధిలో వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. అలాగే గూడూరు మండలంలోని కె.నాగలాపురంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ మాత దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


సి.బెళగల్: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఈశ్వరాలయంలోని పార్వతీ, పాత బస్టాండ్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో కొలువైన అమ్మవారు 9వ రోజు మంగళవారం దుర్గా మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు చేశారు. అలాగే పార్వతీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించినట్లు పూజారి సుదర్శణమాచార్యులు, నరహరి, గిరి తెలిపారు.

కర్నూలు(రూరల్): దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని నిడ్జూరు, మునగాలపాడు గ్రామ పరిధిలో తుంగభద్ర నది ఒడ్డున మామిడి తోటలో వెలసిన అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకొని తమను చల్లగా చూడాలని మొక్కుకున్నారు.

– దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వెంకాయపల్లె ఎల్లమ్మను దుర్గామాతగా అలంకరించారు. మంగళవారం దుర్గాష్టమి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుంకుమార్చన, శివాభిషేకం, మహామంగళహారతి పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.


లొద్దిపల్లెలో పూజలు చేస్తున్న భక్తులు


హుసేనాపురంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


పాణ్యంలో దుర్గాదేవిగా అమ్మవారు


ఏఆర్‌కాలనీలో..


గడివేముల: మూలపెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాణ్యం: మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **ఓర్వకల్లు:** మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లొద్దిపల్లెలో ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహించారు. హుసేనాపురంలో అమ్మవారికి పురోహితులు జంధ్యాల మనోహర్‌శర్మ విశిష్ట పూజలు, అర్చనలు చేశారు. మహిళలు మండపం నుంచి సుంకులాపరమేశ్వరి ఆలయం వరకు బోనాలు తీసుకెళ్లి అమ్మవారిని ఆరాధించారు.

● **గడివేముల:** స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆశ్వయుజ శుద్ధ అష్టమి, పూర్వాషాడ నక్షత్ర యోగంలో దుర్గాదేవి అష్టోత్తర శతనామావళి, దుర్గా–కాళిక మూలమంత్ర హోమం నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఆర్య వైశ్య సంఘం నాయకులు ఉదయగిరి శివయ్య, బొంతల మధుసూదన గుప్తా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భోగేశ్వరాలయం, మూలపెద్దమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. మహిళలు కుంకుమార్చన, స్వామివారికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం


ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు

మండలంలోని తొగర్చేడు గ్రామంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ లోపం కారణంగా ప్రమాదకరంగా మారాయి. ప్రధాన వీధుల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్లకు మొక్కలు, తీగలు అల్లుకుపోయాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – పాణ్యం


తొగర్చేడులో విద్యుత్ స్తంభాన్ని కప్పేసిన ఆకుతీగ

డ్రైనేజీ నీటితో ఇబ్బందులు


మురుగు నీటిని చూపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గొందిపర్ల ఇందిరమ్మ కాలనీలో వర్షపు నీరు, ఇళ్ల నుంచి పారే డ్రైనేజీ నీటితో కలిసి ప్రధాన రహదారి పక్కన కుంట ఎర్పడి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రామక్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మండల సీపీఎం నాయకులు హుసేనయ్య, రాఘవేంద్ర, శ్రీరాములుతో కలిసి ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. కుంటలో నీరు ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలు, రాత్రి సమయంలో రాకపోకలు సాగించే వారు అదుపుతప్పి అందులో పడే ప్రమాదముందని వాపోయారు. కుంటలో నీరు పాచిపట్టి దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వివరించారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకులు ఆంజనేయులు, కృష్ణ, చంద్రన్న, మునిస్వామి, బీసన్న, రామక్రిష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న సంఘం నాయకులు

కల్లూరు: కారు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల కాపరి ఎల్లారాముడు కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి మృతి చెందిన గొర్రెలకు ఒక్కోదానికి రూ. 10వేలు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సంఘటన స్థలాన్ని జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శేఖర్, పెద్ద ఈశ్వరయ్య, వెంకటరాముడు, ధనుంజయ్, వెంకటశివుడు, భీష్ముడు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెల కాపరి ఎల్లరాముడికి నాలుగు కుమార్తెలు ఉన్నారన్నారని తెలిపారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం అనాథ అయిందన్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పత్తి రైతులను ఆదుకోవాలి


ఏపీ రైతు సంఘం నాయకులకు పత్తి పంటను చూపిస్తున్న రైతులు

కల్లూరు: పత్తి రైతులకు ఎకరాకు రూ. 30 వేలు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం బొల్లవరం గ్రామంలో ఏపీ రైతు సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే నెలలో పత్తి సాగు చేయడం వల్ల పంట ఏపుగా పెరగడంతో 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతు ఆశపడ్డారని తెలిపారు. అయితే కాయ దశలో ఉండగా వర్షాలు కురవడంతో పూత పడిపోయిందన్నారు. దీంతో కాయ కుళ్లిపోయిందని పేర్కొన్నారు. ఎకరాకు రూ. 30వేలు వరకు పెట్టబడి ఖర్చులు అయ్యాయన్నారు. వారికి న్యాయం చేయాలన్నారు. సంఘం మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు శేఖర్, లక్ష్మీకాంతరెడ్డి, గోపాల్, నాగశేషులు, మస్తాన్, నరేష్, రైతులు పాల్గొన్నారు.

● పొంచి ఉన్న ప్రమాదం


గుంతలతో కుంగిపోయిన రోడ్డు

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు–ఊడుమల్పూరం గ్రామాల ఉన్న గుంతలు వాహనదారులను భయపెడుతున్నాయి. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం బారిన పడాల్సిన పరిస్థితి. అంతలా రోడ్డుపై గుంతలు పడ్డాయి. వేగంగా వచ్చే వాహనాలు గుంతల్లో పడిపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. అధికారులు గుంతలను పూడ్చి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

వీరశైవులంతా ఏకం కావాలి


మాట్లాడుతున్న వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న

కోడుమూరు రూరల్: న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా వీరశైవులంతా ఏకం కావాలని ఏపీ వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న పిలుపునిచ్చారు. ఆమె మంగళవారం కోడుమూరులోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వీరశైవులనుద్దేశించి మాట్లాడారు.. రాష్ట్రంలో బీసీడీ కింద వీరశైవులున్నా, కేంద్రంలో ఓబీసీ రిజర్వేషన్ లేకపోవడంతో పెద్ద చదువులు చదివినా ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరశైవులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని, సమస్యల పరిష్కారంలో భాగంగా వీరశైవులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కోడుమూరులో వీరశైవులకు కల్యాణమండపం, రుద్రభూమి వంటి వాటిని ఏర్పాటు చేయాలంటూ వీరశైవులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. వీరశైవ లింగాయతీ ఐక్య వేదిక జిల్లా నాయకులు మల్లికార్జున, వీరశైవ సంఘ పెద్దలు చంద్రశేఖరప్ప, పవన్, వీరేశప్ప తదితరులు పాల్గొన్నారు.

● గండి.. ప్రమాదమండి!


మురుగు కాల్వపై ఏర్పడిన గండి, మ్యాన్‌హోల్ పక్కన ప్రమాదకరంగా గండి

ఓర్వకల్లు: ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీ కాల్వపై ఏర్పడిన గండి.. ప్రమాదకరంగా మారింది. నన్నూరు గ్రామంలోని సుంకులమ్మ గుడి ఎదురుగా, కర్నూలు– రామళ్లకోటకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీపై నిర్మించిన మ్యాన్‌హోల్‌కు– సీసీ బెడ్‌కు మధ్య చిన్నపాటి గండి పడింది. రెండేళ్ల క్రితం ఏర్పడిన ఈ గండి అధిక వర్షాల కారణంగా సీసీ బెడ్ దెబ్బతినడంతో కాస్త పెద్దదిగా మారి ప్రమాదకరంగా తయారైంది. నిత్యం వందలాది మందితో రద్దీగా ఉన్న ఈ ప్రదేశంలో గండికి ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గండికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.